
# ఔన్నత్యం

దూరి వెంకటరావు




ఇంట్లో అడుగు పెడుతూనే "అబ్బాయి, వెళ్ళిన ఇంటర్వ్యూ గురించి ఏమైనా చెప్పితగలడ్డాడా?" అడిగాడు ముకుందరావు ముక్కుపుటాలెగరేస్తూ. కోపంలో అతని ముఖం కందగడ్డలా మారింది.

"అడిగిన వాటికన్నీ సమాధానాలు చెప్పానన్నాడు. అయినా వాడు మాత్రం ఏం చేస్తాడు చెప్పండి... ఉద్యోగం ఇస్తే చేయనన్నాడా? వాడినలా కసురుకునే బదులు వాడి ప్రయత్నానికి మీరు కూడా సహకరించరాదు?..." అన్నది జానకమ్మ కొడుకును వెనకేసుకొస్తూ.

"నువ్వనుకోగానే వాడికి ఉద్యోగం వేయించేయడానికి నెనేమన్నా మంత్రిగారినను కున్నావా?!" షర్టువిప్పి తీగమీద ఆరవేస్తూ అన్నాడు ముకుందరావు.

"ఉద్యోగం వేయించడానికి మంత్రిగారే కానక్కర్లేదు" అంది జానకి మూతిమూడు వంకరులు త్రిప్పుతూ.

"నా బోటి గుమస్తా కూడా వేయించగలడంటావ్ అంతేనా ?... ఔనే నీకు

ఉద్యోగాలు అంత తేలిగ్గా కనిపిస్తున్నాయి".

"అది కాదండీ"

"ఏదికాదు, తొందరగా కాఫీకలిపి పట్టుకురా తలనొప్పిగా ఉంది" వాలుకుర్చీ వాల్చుకున్నాడు ముకుందరావు.

"మీ తలనొప్పిఎప్పుడు ఉన్నదేగాని, కాస్త నామాట వింటారా" అంటూ స్టూలు దగ్గరకు తీసుకొని కూర్చుంది జానకమ్మ.

ఏమిటన్నట్లు భార్యవంక చూసాడు ముకుందరావు.

"మరేంలేదు మీ బాల్య మిత్రుడు శ్యామలరావు హైదరాబాదులో ఆఫీసరుగా పనిచేస్తున్నాడని ఆ మధ్యనాతో అన్నారు. ఆయన వద్దకెళ్ళి మనవాడికేదైనా..."

"అడగొచ్చు, ఐతే ప్రస్తుతం నాస్థితి చూసి ఆదరిస్తాడో లేదో నని"

"చిననాటిస్నేహం చిరకాలం ఉంటుందంటారు. ఒకమారు వెళ్ళి ప్రయత్నిస్తే పోయిందేముంది? నాటికుచేలుడు శ్రీకృష్ణభగవానునినాశ్రయించి భోగభాగ్యాలు సమకూర్చుకోలేదా! అడిగితే గాని అమ్మైనా పెట్టదంటారు" హితోపదేశం చేసింది జానకమ్మ.

భార్య మాటలలో ఏదో అంతరార్థం ఇమిడిఉన్నట్లు గోచరించింది ముకుంద రావుకి.

"రేపే హైదరాబాదు వెలదాం సరేనా?"

భర్తమాటలకు అప్పుడే కొడుక్కి ఉద్యోగందొరికిపోయినంతగా సంబరపడి పోయింది జానకమ్మ.

ట్రైన్ దిగుతూనే ఆటోవాడికి అడ్రస్ చెప్పి శ్యామల్‌రావు బంగ్లా చేరుకున్నారు ముకుందరావు దంపతులు.

ఇల్లు ఎంతో అధునాతనంగా ఆకర్షణీయంగా ఉంది. ఇంటి చుట్టూ చక్కని గార్డెను. అందులో మల్లె, మరువం, జాజి, బంతి, చామంతి రకరకాల పూల మొక్కలు తమ సౌరభాన్ని దశ దిశలా విరజిమ్ముతున్నాయి. పోర్టికోలో ఫీయట్‌కారుఉంది.

అతడి వైభవం చూసి ఆశ్చర్యపోయాడు ముకుందరావు. ఇరువురు చిన్నతనంలో ఒకే బెంచీమీద కూర్చొని చదువుకున్నారు. ఇప్పుడు వారి మధ్య ఎంత ఆంతరం ? అంతా లలాటలిఖితం.

గేటు తీసుకొని లోపలకు వెళ్ళగా కనిపించాడు శ్యామలరావు.

తెల్లని మల్లెపూవులాంటి పాలిస్టర్ షర్టు ఫ్యాంటు మీద బ్లూకలర్ కోటు ధరించాడు. నల్లని బాటా ఎక్స్‌క్ల్యూజివ్ బూటువేసుకున్నాడు.

అప్రయత్నంగా చేతులు జోడించారు ముకుందరావు దంపతులు.

"మీరు..."

శ్యామలరావు ప్రశ్నకి ముకుందరావు ముఖం మాడిపోయింది. మరుక్షణం తనెవర న్నది గుర్తుచేశాడు.

"నాకు తెలిసినంతవరకు నాఫ్రెండ్స్ సర్కిల్‌లో ముకుందరావు పేరుగలవారెవరు లేరే"

శ్యామలరావు మాటలకి, అతడిని మ్రింగేసేటట్లు చూసింది జానకమ్మ.

నడమంత్రపుసిరి రాగానే కళ్ళునెత్తిమీదకు పోతాయంటారు దీన్నే కాబోలు అనుకుంది. అనవసరంగా భర్తను రప్పించి అవమానానికి గురిచేసినందుకు ఎంతో బాధపడింది.

"ఇంతకు మీరే పనిమీద వచ్చారో చెప్పనేలేదు" అడిగాడు శ్యామలరావు శిలాప్రతిమల్లా నిలబడిపోయిన ముకుందరావు దంపతులనుద్దేశించి.

"వచ్చిన పని వాకిట్లోనే అయిపోయింది మరి మాకు సెలవిప్పించండి" అన్నాడు ముకుందరావు అతికష్టంమీద.

"అలా అంటే నేనేం చెయ్యను"?

"మీరు మా మిత్రులని భావించి మా వాడికేదైనా ఉద్యోగంవేయిస్తారేమోనన్న ఆశతో మీదరికొచ్చాము. అయితే నన్నిప్పుడు మీరు గుర్తించే స్థితిలో లేరు వస్తాం." భార్య చేయిపుచ్చుకుని వెనుదిరిగాడు ముకుందరావు.

"ఆగు"

గంభీరమైన శ్యామలరావు పిలుపుకు ఆశ్చర్యంగా చూశారు ముకుందరావు దంపతులు.

నా మాటలకు నువ్వెలా రియాక్ట్ అవుతావో చూడటానికలా నటించాను. స్నేహాన్ని అంత తొందరగా మరచిపోయేటంతటి దౌర్భాగ్యుణ్ణి కాదు.

"శ్యామ్"

"టేక్ ఇట్ ఈజి" అంటూ ముకుందరావుని కౌగిలించుకున్నాడు శ్యామలరావు.

ముకుందరావుమనసిప్పుడు తేలికపడింది.

వారిరువురి స్నేహాన్ని చూసిన జానకమ్మ నయనాలు వర్షించాయి.

"ఒరేయ్, నాకొడుక్కి ఉద్యోగం వేయిస్తావా లేక తన్నమంటావా అని అడగడం మానేసి ఎవరినో కొత్తవారిని ప్రాధేయపడుతున్నట్లు ఏమిటామాటలు" అన్నాడు శ్యామలరావు.

"శ్యామ్ నువ్వు మారిపోయావనుకున్నాను కాని మారలేదురా నా శ్యామ్ ఎప్పుడు మారడు" తడబడుతున్నాయి ముకుందరావు మాటలు.

నీ సుపుత్రుడికి ఏదో ఒక ఉద్యోగం వేయించేపూచి నాది సరేనా? నారాయణా ! వీళ్ళకు స్నానానికి నీళ్ళు సిద్ధం చెయ్యి. మీరిక్కడ ఏమీ మొహమాటపడకండి. ఫీల్ ఇట్ యువర్ హోమ్ ఇప్పుడే వస్తాను టైమ్ పాస్‌కి వేడి వేడి ఫల్లీలు" అంటూ నవ్వి వెళ్ళిపోయాడు శ్యామలరావు.

"నేను చెప్పలా జానకి శ్యామ్ తప్పకుండా మన వేణుకి ఉద్యోగంవేయిస్తాడని" అన్నాడు ముకుందరావు భార్యవైపుతిరిగి.

"ఔనూ... మీ స్నేహితుడు బయటకు వెళుతూ టైమ్ పాస్‌కి వేడి వేడి ఫల్లీలంటా డేంటి? వేపకాయంత వెర్రిగాని వుందా" ఉండబట్టలేక మనసులోని సందేహాన్ని బయటపెట్టింది జానకమ్మ.

"నేను వాడికిచ్చిన సలహా అది, వాడిపాలిట అది బ్రహ్మాస్త్రంలా పనిచేసింది"

"ఫల్లీల సలహాఏమిటండీ" అర్థం కాక అయోమయంగా చూసింది జానకమ్మ.

"చెప్తాను ఇలాకూర్చో. నేను శ్యామ్ ఒకేదగ్గర చదువుకున్నామన్న సంగతి నీకు తెలుసు. నేను ఎస్.ఎస్.సి. దగ్గరే ఫుల్ స్టాప్ పెడితే వాడు డిగ్రీ వారకు చదివాడు. చదువైన తరువాత చాలా ఉద్యోగాలకు ధరకాస్తులు పడేశాడు. ఒక సారి ఏదో ఆఫీసరు పోస్టుకి ఇంటర్వ్యూకి రమ్మనమని కాల్ లెటరు వచ్చింది. హైదరాబాద్ వెళ్ళిరావాలంటే మాటలా? వాళ్ళనాన్నని డబ్బుఅడిగితే చిల్లి గవ్వలేదని కసిరి కొట్టాడు మనవాడికి పోస్టుమీద గట్టి నమ్మకం వుంది అందుకే నా దగ్గరకొచ్చాడు వాడికివ్వడానికి నాదగ్గరేముంది? కాస్సేపు ఆలోచించి ఒక ఉచిత సలహాపారేసాను.

"ఇంతకు ఆ సలహాఏమిటో చెప్పండి" మరింత ఆశక్తి గనపరచింది జానకమ్మ.

"ఏముంది వేరీ సింపుల్ లుంగి బనియను ధరించి జంగిట్లో రెండు కిలోల వేడిశెనగపప్పు వేయించుకొని ట్రైన్లో అమ్ముకుంటూ హైదరాబాదు పొమ్మన్నాను. ఫల్లీలు అమ్ముకునేవాణ్ణి ఎవరు టికెట్టు అడగరన్నాను నా సలహాతూచాతప్పకుండా అమలు జరిపాడు మధ్యలో టిటిసివస్తే "టైమ్ పాస్‌కి వేడి వేడి ఫల్లీలు తినండి సార్" అంటూ పిడికెడు వేరుసెనగపప్పు పొట్లంకట్టి అతడికిస్తే పొంగిపోయాడట.

ఇంటర్వ్యూలో సెలక్టై ఉద్యోగంలో చేరేముందు నేనిచ్చిన సలహాకి నన్నెంతగా అభినందించాడో మాటల్లో చెప్పలేను. ఏదో రకంగా నావలన వాడికి మేలు జరిగినందుకు ఆ భగవంతుడికి మనసులోనే జోహార్లర్పించాను.

"మీరిచ్చిన ఈ మాత్రం సలహాకి మీ పట్ల ఇంత వరకు కృతజ్ఞత కలిగిఉన్నారంటే అది మీ స్నేహితుని ఔన్నత్యాన్ని చాటుతుంది" అంది జానకమ్మ అతనిని కొనియాడు తున్నట్లుగా.

"స్నానానికి రండి వేడినీళ్ళు సిద్ధం చేసాను" నారాయణ పిలుపుతో బాత్రూమ్‌వైపు నడిచాడు ముకుందరావు